క్లుప్తంగా

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోండి

పాన్‌గల్: 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ చక్రపాణి ఆదివారం ప్రకటనలో సూచించారు. ప్రతి గ్రామంలో కొత్తగా ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు వంటి అంశాలపై బీఎల్‌ఓలు అవగాహన కల్పించి తప్పులు లేని జాబితా తయారీకి సహకరించాలన్నారు. ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి వివరాలను ప్రత్యేక దరఖాస్తులో పొందుపర్చాలని తహసీల్దార్ బీఎల్‌ఓలకు సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ చెందిన లక్ష్మికి రూ.18వేలు, దాశిలి పావమ్మకు రూ.7వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధితో పేద కుటుంబాలు కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, నర్సింహ, రాములు, బారయ్య, బాలస్వామి, కల్యాణ్ పాల్గొన్నారు.

ఘన సన్మానం

పాన్‌గల్: రోమోస్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా మండలంలోని వెంగళాయిపల్లి చెందిన తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. ఆదివారం గ్రామంలో సర్పంచ్, స్నేహితులు, గ్రామస్తులు ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్, జీవన్‌రెడ్డి, బషీర్, జేపీ రెడ్డి పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

వనపర్తి: అక్రమ మట్టి తవ్వకాలపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని గ్రామంలోని యువకులు రంగంలోకి దిగారు. ఆదివారం మండలంలోని కడుకుంట్ల యువకులు మట్టి తరలించేందుకు వచ్చిన వాహనాలను అడ్డుకుని పంచాయతీ వద్దకు తీసుకువచ్చారు. గ్రామంలోని కొందరు బీఆర్‌ఎస్‌నాయకుల అండదండలతో సాగుతున్న మట్టిదందాపై తాడోపేడో తేలాలని యువకులు పట్టుబట్టారు. సుదీర్ఘ చర్చల తర్వాత గ్రామానికి కొంత మొత్తం జరిమానా చెల్లించాలని గ్రామస్తులు చేసిన తీర్మానంతో మట్టిదుమారంకు తెరపడింది. అక్రమమట్టిదందాకు తెగబడిన వ్యక్తులు కొత్తకోట అధికార పార్టీకి చెందిన నాయకులుగా గ్రామంలో చర్చించుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అమ్మపల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పిడుగు గోపి తల్లి నాగమ్మ(50) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి ఆదివారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, వేణుయాదవ్, కోట్ల వెంకటేష్, శివారెడ్డి, వెంకటయ్య, శివ, శ్రీను తదితరులు ఉన్నారు.

చర్చి అభివృద్ధికి నిధులు మంజూరు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని మారెమ్మ కుంటలో గల హెబ్రోన్ చర్చి అభివృద్ధి కోసం వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి రూ.5లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మంత్రి సతీమణి వాసంతి ఆదివారం చర్చి సంఘానికి నిధులు అందజేశారు. అనంతరం ఆమెను సంఘ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, దానేలు, విజయ్‌కుమార్, రంజిత్, విశ్వం బాబు, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవి చెరబండరాజుకు ఘన నివాళి



వనపర్తిటౌన్: కలంతో విప్లవాన్ని మరో స్థాయికి తీసుకెళ్లిన మహా కవుల్లో చెరబండరాజు ఒకరని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో విప్లవ కవి చెరబండరాజు 41వ వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఉద్యమాల నుంచి నాయకులు పుట్టుకొస్తారని, నాయకులు ఉద్యమాన్ని సృష్టించరని చెరబండరాజు నమ్మేవాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, నరసింహశర్మ, దేవన్ననాయుడు, సురేష్, సేనాపతి, వెంకటస్వామి, ఈశ్వర్, పరమేశ్వరచారి, దేవేంద్రచారి, సత్యంచారి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా అవే రోడ్లు..

- పూర్తిగా ధ్వంసమైన 7కి.మీ. రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆవేదన



మూలమళ్ల రోడ్డుపై పారుతున్న నీరు



ఆత్మకూర్ శివారులో గుంతలమయంగా మారిన రహదారి

ఆత్మకూర్: ప్రయాణం.. నరకప్రాయంగా మారింది. ఏళ్లు గడుస్తున్న పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని మూలమళ్ల, నందిమళ్లకు, జూరాల ప్రాజెక్టుకు వెళ్లేందుకు ఆత్మకూర్ పెట్రోల్‌బంకు మలుపు నుంచి మొదలుకుని 7కిలో మీటర్ల మేర బీటీ రోడ్డును వేశారు. 2004లో స్వర్ణమ్మ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వేసిన రోడ్డు ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. పదేళ్లుగా గుంతల రోడ్డుతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మరమ్మతులు లేకుంటే కొత్త బీటీరోడ్డు వేయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని మూలమళ్ల, నందిమళ్ల గ్రామస్తులు కోరుతున్నారు.

నిలిచిన రోడ్డు పనులు

మూలమళ్ల మలుపు నుంచి నందిమల్ల, జూరాల ప్రాజెక్టు వరకు రూ.8.50 కోట్ల నిధులతో 2016లో రోడ్డు పనులు ఆర్భాటంగా ప్రారంభించారు. మొదటి దఫా నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులను మధ్యలోనే వదిలేశారు. ఈవిషయమై గ్రామస్తులు పలుమార్లు పీజేపీ కార్యాలయం వద్ద ధర్నా చేసిన నిధులలేమితో పనులు సాగలేదు. పంచాయతీ రాజ్ నిధుల నుంచి రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాలకుల అసమర్థత..



2016లో పుష్కరాలప్పుడు మంజూరైన రోడ్డు పనులు నేటికి చేపట్టకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే, అధికారుల అసమర్థతే కారణం. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా, ప్రయాణికులు చనిపోతున్నా స్పందించకపోవడం పాలకుల పనితీరుకు నిదర్శనం. వెంటనే పనులను ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

–మోషె, సీపీఎం, మూలమళ్ల

నిత్యం ప్రమాదాలు



నందిమళ్ల నుంచి మూలమళ్ల మీదుగా ఆత్మకూర్‌కు వెళ్లాలంటే భయమేస్తుంది. ప్రతి నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది వరకే ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్న పనులు చేపట్టలేదు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఇప్పటికైనా రోడ్డు పనులను వెంటనే చేపట్టాలి.

– రాజేందర్‌రెడ్డి, నందిమళ్ల

మత్స్యకారులు ఐక్యంగా పోరాడాలి



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న మత్స్యకారుల సంఘం నాయకులు

పాన్‌గల్: మత్స్యకారులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉంటూ పోరాటాలు సాగించాలని సంఘం నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున్ అన్నారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనంలో సొసైటీ సభ్యులకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మత్స్యకారులు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా, ఆర్థికంగా, విద్య పరంగా బలోపేతం కావాలన్నారు. సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని వనపర్తి జిల్లా అధ్యక్షుడు పుట్ట బాలరాజు, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, చెందిశేఖర్, బాలరాజు, సురేంద్రబాబు, కృష్ణయ్య, చెన్నమ్మ, బాలస్వామి, రంగస్వామి, కుర్మయ్య, శ్రీను, జమ్ములయ్య, నిరంజన్, శ్రీను, బాలరాం పాల్గొన్నారు.

ఎట్టకేలకు రక్షణ గోడల నిర్మాణం



ఖిల్లాఘనపురం చింతచెల్ల బావి వద్ద నిర్మించిన రక్షణ గోడ

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా పాడుబడిన బావులు ఉండటంతో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని పలు సందర్భాల్లో ప్రజలు కోరారు. ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ రోడ్లతో పాటుగా రక్షణ గోడల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. అధికారులు ప్రత్యేకంగా గుర్తించి నాలుగు బావుల వద్ద రక్షణ గోడలు నిర్మించడంతో పాటుగా పైపు కల్వేట్లు పాడైన వద్ద కొత్తగా పైపులు వేయించారు. దీంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పర్వతాపురం సమీపంలో..



అప్పారెడ్డిపల్లి అడ్డా రోడ్డు పాత బావి వద్ద నిర్మించిన రక్షణ గోడ

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గోపాల్‌పేట: తాడిపర్తిలో పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలంలోని తాడిపర్తిలో కుర్మయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుపేదలు ఎక్కడ ఉన్నా ప్రభుత్వం వారిని గుర్తించి వారికి ఇళ్ల స్థలాలతో పాటు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. పలు డిమాండ్లతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఇదే విషయంపై సోమవారం వనపర్తి ఆర్డీఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ధర్నాకు దిగుతామని చెప్పారు. కార్యక్రమంలో గట్టయ్య, సుందరయ్య, బుర్దయ్య, సాయిలు, మన్యం తదితరులు పాల్గొన్నారు.

సేవలందిస్తేనే గుర్తింపు



వనపర్తిటౌన్: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించే ఉద్యోగులు ప్రజల మదిలో నిలుస్తారని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్ అన్నారు. గ్రామీణ వికాస బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ రిటైర్డ్ అయిన బుచన్న దంపతులను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుచ్చన్న గుమ్మడం, పెబ్బేర్, కోదాడ బ్యాంక్‌లో మేనేజర్‌గా 25ఏళ్లుగా పని చేసి రిటైర్డ్ అయ్యారన్నారు. పేద ప్రజలకు, రైతులకు ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం రుణాలు ఇచ్చేందుకు విశేషంగా కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, సతీష్, నరేష్, నందకిశోర్, నాగరాజు, పావని పాల్గొన్నారు.

యువకుడు మృతి

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన యూసూబీ, గౌసుమియా దంపతుల రెండో కుమారుడు చాంద్ పాషా(37) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. కుమారుడి అకాల మరణంతో కుటుంబంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

ధర్నాకు తరలిరండి

పాన్‌గల్: ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను పరిష్కారించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము ఆదివారం ప్రకటనలో కోరారు. అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రగట్టు మైసమ్మకు తీరొక్క పూజలు



ఆలయం ప్రాంగణంలో భక్తుల సందడి

మదనాపురం: మండలంలోని ఎర్రగట్టు మైసమ్మకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రార్థించారు. ఆయా ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పోరాటాల వల్లే పోడు భూముల పట్టాలు

పాన్‌గల్: గిరిజన సంఘం, వామ పక్షాల పోరాట ఫలితంగానే ప్రభుత్వం జిల్లాలో పోడు భూముల పట్టాలను పంపిణీ చేసినట్లు గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనపర్తి, పెద్దమందడి, ఖిల్లా ఘనపురం మండలాలల్లో 415 మంది లబ్ధిదారులకు 481 ఎకరాలకు హక్కుల పత్రాలు ఇచ్చిందన్నారు. మిగతా మండలాల్లో దరఖాస్తులు చేసుకున్న వారికి పట్టాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పట్టాలు ఇవ్వని మండలాల్లో దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాబు, పోమ్లా, సీతమ్మ, చిట్టెమ్మ, లక్ష్మి, హరిత తదితరులు పాల్గొన్నారు.

అందని బిల్లులు.. నిలిచిన పనులు



అమరచింతలో అసంపూర్తిగా వైకుంఠధామం

అమరచింత: ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలలో అధునాతనమైన పద్ధతిలో వైకుంఠధామాలను నిర్మించడానికి రూ.కోటి నిధులను విడుదల చేసింది. వీటి కోసం టెండర్ ప్రక్రియను చేపట్టి పనులను అప్పగించింది. పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ సరైన సమయానికి బిల్లులు అందక పోవడంతో పనులను నిలిపివేశారు. దీంతో మున్సిపాలిటీలకు ప్రభుత్వం స్పెషల్ బడ్జెట్ ద్వారా నిధులను సమకూర్చుతుండటంతో కాంట్రాక్టర్‌లకు సకాలంలో డబ్బులు అందక పోవడమే ఇందుకు ప్రధాన కారణం.

50శాతం కూడా పూర్తికాని వైనం

మున్సిపాలిటీలో వైకుంఠధామ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండేళ్ల కిందట పనులను ప్రారంభించి ఇప్పటి వరకు 50 శాతం కూడా పూర్తి చేయలేకపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, బిల్లులు రాక పనుల్లో జాప్యం అవుతుంది.

త్వరగా పూర్తి చేస్తాం



పట్టణంలో నిర్మిస్తున్న వైకుంఠధామ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటి వరకు సదరు కాంట్రాక్టర్‌కు రూ.35 లక్షలు చెల్లించాం. మిగిలిన డబ్బుల కోసం బిల్లులు సిద్ధం చేశాం. ప్రస్తుతం రెండు నెలలుగా పనులు నిలిచి పోయాయి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను పూర్తి చేస్తాం.

–మహమ్మద్ ఖాజా, మున్సిపల్ కమిషనర్, అమరచింత

గ్రామాల్లో కాంగ్రెస్ జెండా పండుగ



ధర్మాపూర్‌లో జెండాకట్టకు రంగులు అద్దుతున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కార్యాచరణ చేపట్టినట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి అయ్యుబ్‌ఖాన్ తెలిపారు. పార్టీ జెండా పండుగలకు సర్వం సిద్ధం చేస్తున్నామని మండలంలోని ధర్మాపూర్, చంద్రగఢ్‌లో ఆదివారం పార్టీ జెండా కట్టల మరమ్మతులతో పాటు రంగులద్దే కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటే అన్న విషయం ప్రజలకు ఇప్పటికే అర్థమైందని, విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ గతంలో చేసిన పనులే నేటికి పదిలంగా దర్శన మిస్తున్నాయన్నారు. నాడు ఇందిరమ్మ పేరిట ఇచ్చిన ఇళ్లు తప్ప ఇప్పటి వరకు ఇళ్లు, ఇంటిస్థలాలు ఇవ్వలేకపోవడం శోచనీయం అన్నారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, విష్ణు, బీసీరెడ్డి, రహమతుల్లా పాల్గొన్నారు.

పూడుకుపోతున్న చెరువు కాల్వ



అమరచింత శివారులో చెరువు నీటిని తరలించే కాల్వ దుస్థితి

అమరచింత: అమరచింత పెద్ద చెరువును 15ఏళ్ల కిందట లిఫ్ట్ నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరును అందించాలనే సంకల్పంతో నిర్మించగా, ప్రస్తుతం పూడుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. అమరచింత లిఫ్ట్ నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ, ఎమ్మెల్యే నిధుల ద్వారా కాల్వ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహారపథకం ద్వారా మరోమారు నిధులు మంజూరు కావడంతో పూర్తి స్థాయిలో కాల్వ పూర్తయ్యింది. 12 ఏళ్లుగా లిఫ్ట్ నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలక పోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో నీటి నిర్వహణ మరిచిపోయారు. దీంతో కాల్వలో భారీ చెట్లతో పాటు ముళ్లపొదలు కమ్ముకున్నాయి. మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు.

మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి వైపు

వనపర్తిటౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనతోనే దేశం అభివృద్ధి వైపు నడుస్తుందని బీజేపీ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ కృష్ణయ్య అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని 6వ, వార్డు మెట్టిపల్లిలో కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు.

చిన్నంబావి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కర్ణాటక కేంద్ర విస్తారక్ సోమేష్ ఉప్పనల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పలువురు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీ విజయం కోసం బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బూత్ అధ్యక్షుల సమావేశానికి ముఖ్యఅతిథిగా కర్ణాటక విస్తరక్ లింగరాజు హాజరై మాట్లాడారు.

మదనాపురం: రాష్ట్రంలో బీజేపీని ఎన్నడూ లేనివిధంగా ప్రజలు ఆదరిస్తున్నారని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్ తెలిపారు. ఆదివారం మండలంలోని దుప్పల్లిలో ఇంటింటా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సాయిబాబా, మహేష్, రవి, కృష్ణయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



దుప్పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూర్: ప్రధానమంత్రి మోదీకి ప్రపంచమే జేజేలు పలుకుతుందని ఆయన చేపడుతున్న అభివృద్ధే రాష్ట్రంలో పార్టీని గెలిపిస్తుందని కర్ణాటక బీజేపీ విస్తారక్ శ్రీకాంత్‌నాయక్ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని వార్డుల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, నాగేందర్‌రెడ్డి, బాలకృష్ణ, యశ్వంత్, సమద్, బాలకృష్ణ, రఘు, చందు తదితరులు ఉన్నారు.